# కవితోల్బణం

ఆ రాజ్యంలో కవులు ఎక్కువయ్యారు. గిరజాల కవులూ, లాల్చీకవులేకాదు, బుష్‌కోటు వేసి కవితను పెరేడ్ చేసేవాళ్ళూ కవయిత్రులూ ఎందరో వెలిశారు (వెలిసిపోయారనికాదు). రాజుగారికి చెప్పలేనంత దిగులుపట్టుకుంది. సర్వులూ కవిత్వంతప్ప ఇంకేమీ చేయకపోతే ఎలా? అన్నిరంగాల్లో ఉత్పత్తి పడిపోయింది. ఎక్కడచూసినా కవిత్వం తప్ప ఇంకేమీ వినిపించదు.

వెంటనే రాజుగారు దండోరా వేయించారు. ఈ వ్యాధికి మందు కనిపెట్టిన వాళ్ళకు అర్ధ సామ్రాజ్యాన్నీ కూతుర్నీ ఇస్తానని. రోజులు గడిచిపోతున్నాయి. ఎవరూ రావడంలేదు, ఆఖరిరోజు – గడువురోజు వచ్చేసింది. ఒక భిషగ్వరుడు వచ్చాడు. లోపలికి చీటీ పంపించాడు. (ఇదేకదా ఫేషన్. మతాధిపతులకుకూడా ఇవాళ పర్సనల్ అసిస్టెంట్లూ కాలింగ్‌బెల్లులూ కదః). రాజుగారు రమ్మన్నాడు. భిషగ్వరుడు లోపలికి ప్రవేశించి ఒకసీసా రాజుగారి ముందుపెట్టాడు. రాజుగారు ఒక మాత్రతీసి ఆస్థానకవికి ఇచ్చాడు. అంతే, వెంటనే ఆయన మామ్మూలు మనిషిగా మాట్లాడ్డం మొదలుపెట్టాడు. మంజులంగా మార్దవంగా ఫెమినైన్‌గా మాటాడటం పోయి, మగవాడిలా మాట్లాడాడు. రాజుగారు ఆ మాత్రలు ఊళ్లో కవులందరికీ ఇప్పించారు. కవిత ఎక్కడా వినిపించడం మానేశింది. "ఈమాత్ర పేరేమిటండీ" అన్నాడు రాజుగారు చివరికి. "కవితా విధ్వంసిని సార్ ఇంకోసీసా కావాలాసార్" అన్నాడు భిషగ్వరుడు.

నీతి : కవితోల్బణంకూడా ద్రవ్యోల్బణంలా ప్రమాదమే.

---

గోపాలచక్రవర్తి

---